మాజీ మంత్రి కేటీఆర్‌కు శుభాకాంక్షలు

మియాపూర్ , జనవరి 4 : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆయన నివాసంలో శనివారం పార్టీ మియాపూర్ డివిజన్ సీనియర్ నాయకుడు గోపరాజు శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిశారు. పూల మొక్క అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

మాదాపూర్ : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు పార్టీ కార్యకర్తలతో కలిసి శనివారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన మాదాపూర్ డివిజన్ బీఆర్‌ఎస్ గౌరవాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్

జీడిమెట్ల స్టేషన్‌లో పోలీసుల శ్రమదానం

జీడిమెట్ల, జనవరి 4 : జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ అవరణలో అధికారులు, పోలీస్ సిబ్బంది శనివారం శ్రమదానం చేశారు. వాహనాల పార్కింగ్ ఏరియాలో ఉన్న చెత్త చెదారాలను ముండ్ల కంపలను తొలగించారు. గడ్డపారలు చేత పట్టి భూమిని చదును చేశారు. కార్యక్రమంలో జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేశ్, ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రహ‘దారి’ సమస్య పరిష్కారానికి కృషి

• కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 4 : కేపీహెచ్‌బీ కాలనీ 5,6 రోడ్ల వాసులు ఎదుర్కొంటున్న రోడ్డు సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. శనివారం కూకట్‌పల్లి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కృష్ణారావును కేపీహెచ్‌బీ కాలనీ 1,2వ ఫేజ్‌ల వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కేపీహెచ్‌బీ కాలనీ 4వ రోడ్డు రెమెడీ వైద్యశాల వద్ద బారికేడ్స్ ఏర్పాటు చేయడంతో ముంబయి హైవే నుంచి కాలనీ 5,6వ రోడ్లలోకి రాకపోకలు నిలిచిపోయాయని తెలిపారు. దాంతో కార్లు, స్కూల్ బస్సులు, ఇతర వాహనాలు రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. ఈ రెండు రోడ్లకు వాహనాలు వెళ్లేలా రోడ్డు సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. అదేవిధంగా పాదచారుల వంతెన వద్ద జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు చేయాలని, లిఫ్ట్‌ను బాగుచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, బీఆర్‌ఎస్ నాయకులున్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడికి ఎమ్మెల్యే పరామర్శ

అనారోగ్యంతో బాధపడుతున్న బాలాజీనగర్ డివిజన్ టి.అంజయ్యనగర్‌లో నివసిస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు ఖాజాపటేల్‌ను శనివారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ బాబురావు,డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, మున్నాబాయ్, కన్నయ్య, భాస్కర్‌రావు, సుశీల్‌కుమార్ తదితరులున్నారు.

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న కేపీహెచ్‌బీ కాలనీ 1,2 ఫేజ్‌ల వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు



ధనుర్మాస ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారావు

హరిహర క్షేత్రంలో ధనుర్మాస పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

బాలానగర్ : ఫతేనగర్ డివిజన్ పరిధి భరత్‌నగర్ కాలనీలోని శ్రీహరిహర క్షేత్రంలో శనివారం ధనుర్మాసంలో భాగంగా శ్రీవేంకటేశ్వరస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, స్థానిక కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ లక్ష పుష్పార్చనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్,నాగిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి,సాంబశివారెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, ఉమావతిగౌడ్, జ్యోతిగౌడ్, ఉమ, విజయ్, సోమయ్య కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

• కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

ఎమ్మెల్యే వివేకానంద్‌కు ఆహ్వానపత్రికలు అందజేస్తున్న వివిధ కాలనీల ప్రతినిధులు

కుత్బుల్లాపూర్, జనవరి 4 : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. శనివారం దండముడిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను నియోజకవర్గానికి చెందిన కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు, ప్రజలు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం ఎమ్మెల్యే కొత్త సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించి మాట్లాడారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు చెందిన రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తమ అసోసియేషన్‌కు కుత్బుల్లాపూర్‌లో స్థలాన్ని కేటాయించాలని కోరారు.

హాస్పిటల్ మేనేజ్‌మెంట్ పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 4: ఓయూ పరిధిలోని మాస్టర్స్ డిగ్రీ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ (ఎండీహెచ్‌ఎం) కోర్సు పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 9వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.300 అపరాధ రుసుముతో 16వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

ఆకట్టుకున్న ఒడిస్సీ నృత్య ప్రదర్శన

కొండాపూర్, జనవరి 4 : వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా శనివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో పలువురు కళాకారుల నృత్య ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇందులో భాగంగా ‘ఒడిస్సీ నృత్య సుధా’ పేరుతో ప్రదర్శించిన ఒడిస్సీ నృత్యాలు ఆద్యంతం అలరించాయి. కళాకారులు తృప్తి సుధా సాహూ, దర్వి, ఇనాయ, చార్వి, అక్షిత, వర్షపాండా, సుకన్య తదితరులు మంగళచర్మం, వక్రతుండ, అభినయ, స్థాయి, మేఘ పల్లవి, శబరి పల్లవి, బసంత్ పల్లవి, దుర్గస్తుతి, జగన్నాథ్ అష్టకం అంశాలను ఒడిస్సీ నృత్యరూపకంలో ప్రదర్శించారు.

ఎంఏ లాంగ్వేజెస్ పరీక్షా ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 4: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఏ లాంగ్వేజెస్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

సాదాసీదాగా ‘నిజాంపేట్’ సర్వసభ్య సమావేశం

సమావేశంలో పాల్గొన్న నిజాంపేట్ మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్, సభ్యులు

దుండిగల్,జనవరి 4 : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గ సర్వసభ్యసమావేశం శనివారం మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి అధ్యక్షతన ప్రగతినగర్‌లోని కార్యాలయంలో సాదాసీదాగా జరిగింది. ఈ సందర్భంగా ఇప్పటివరకు మంజూరైన, పూర్తిచేసిన, నిర్మాణ దశలో ఉన్న పనులతోపాటు టెండర్ దశలో ఉన్న పనులపై చర్చించారు. కార్పొరేషన్ పరిధిలోని 33 డివిజన్లలో మౌలిక సదుపాయాల కల్పన, సమస్యల పరిష్కారంపై సుదీర్ఘంగా చర్చించారు.

సమావేశంలో కమిషనర్ సాబేర్ అలీ, డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, కార్పొరేటర్లు, కోఅప్షన్ సభ్యులతోపాటు, వివిధ విభాగాల అధికారులు, వార్డు ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ‘స్ప్లాష్-2025’ ఉత్సవాలు

కాచిగూడ : కొత్త ఆలోచనలతో దేశాభివృద్ధికి తోడ్పడాలని, లక్ష్యంతో చదువుకుంటే విజయాలు సాధించవచ్చని అసోసియేట్ డైరెక్టర్ అనుషా విజయ్‌కాంత్ అన్నారు. కాచిగూడ బద్రుక కళాశాల పీజీ (ఎంబీఏ) ఆధ్వర్యంలో స్ప్లాష్-2025 శనివారం రాత్రి ముగింపు వేడుకలు విద్యార్థులు సందడిగా నిర్వహించారు. ఫ్యాషన్ షో, డాన్స్ పోటీల్లో కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా అనుషా విజయ్‌కాంత్ విచ్చేసి మాట్లాడారు. ర్యాన్ ట్యాక్స్ ఇండియా ఎన్‌ట్రోల్డ్ డైరెక్టర్ జీతల్ టక్కర్ పాల్గొన్నారు.

అలరించిన నృత్యప్రదర్శనలు

మాదాపూర్, జనవరి 4: మాదాపూర్‌లోని అన్నమాచార్య బావనా వాహినిలో శనివారం పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. ఈ సందర్భంగా గురుకులం మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ కూచిపూడి నృత్య గురువు పోపూరి లక్ష్మీతులసి శిష్య బృందం పోపూరి షన్ముఖవేద, కృతి, సన్విత, హర్షిత, చక్రిక, వెంకట భావిక సంయుక్తంగా కూచిపూడి నృత్యంతో ఆనంద నర్తన గణపతి, కొలువైతివి రంగు సాయి, తక్కువేమి మనకు, అలరులు కురియగ, ముద్దుగారె యశోద, పలుకు తేనెల తల్లి, నిరాయణతే సినర్జీ, ఎంత మాత్రమున వంటి సంకీర్తనలకు నృత్య ప్రదర్శనలు చేశారు. అనంతరం పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు కళాకారులను సత్కరించి జ్ఞాపికలను అందజేసి ప్రశంసించారు.

సంస్కృతీ సాంప్రదాయాలను కాపాడుకోవాలి

వసంతనగర్‌లో సంక్రాంతి ముగ్గుల పోటీల విజేతలతో కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు, తదితరులు

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 4 : మన సంస్కృతీ సాంప్రదాయాలను కాపాడుకుని భవిష్యత్ తరాలకు అందించాలని కార్పొరేటర్ మందడి శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్ వసంతనగర్‌లో మహిళా మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలను కార్పొరేటర్ మందడి శ్రీనివాస్‌రావు ప్రారంభించి మాట్లాడారు.. మహిళలు ఇంటి ముంగిళ్లలో వేసే ముగ్గుల్లో సృజనాత్మకత దాగి ఉంటుందన్నారు. అనంతరం పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ చీరను బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ మాజీ అధ్యక్షుడు సాయిబాబాచౌదరి, నైన్‌యార్డ్స్ లక్ష్మణ్, శ్యామలరాజు, నాగేశ్వర్‌రావు, శివరామకృష్ణ, నాగిరెడ్డి,మహిళా మండలి సభ్యులు పద్మచౌదరి, రజనీ, సీతామహలక్ష్మి, సుశీల తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో సమస్యలు పరిష్కరిస్తా..: కార్పొరేటర్

హైదర్‌నగర్ డివిజన్‌లో సమస్యలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు

మియాపూర్, జనవరి 4 : హైదర్‌నగర్ డివిజన్ సాయి ప్రశాంత్‌నగర్ ఫేజ్ 1, 2 కృష్ణవేణి, శ్రీరామ్‌నగర్ కాలనీల్లో శనివారం కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా తాగునీరు, డ్రైనేజీ, రహదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కాలనీ వాసులను భాగస్వాములను చేస్తూ అభివృద్ధి పనులను చేపడతామన్నారు. కార్యక్రమంలో డీజీఎం నాగప్రియ, ప్రశాంతి, సాయి, వివిధ కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ఏర్పాటుకు రూ.2లక్షల విరాళం

చెక్కులను ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేస్తున్న వెంకటేశ్వర్‌రావు కుటుంబసభ్యులు

దుండిగల్, జనవరి 4 : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి మధురానగర్ కాలనీలో అష్టలక్ష్మి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం నిర్మిస్తున్నారు. ఆలయ ధ్వజస్తంభం ఏర్పాటుకు మధురానగర్ కాలనీ ఫేస్-2కు చెందిన జీ.వెంకటేశ్వర్‌రావు, మహాలక్ష్మి దంపతులు, వారి కుమారుడు ఆదర్శ్ రూ. 2లక్షలను విరాళంగా అందజేశారు. శనివారం ఇందుకు సంబంధించిన చెక్కులను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు విరాళ దాత కుటుంబ సభ్యులను సన్మానించారు. దాతలు వస్తు, ధన రూపంలో విరాళాలు అందించేందుకు ముందుకురావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు విష్ణువర్ధన్ రావు, రాంబాబు, మద్దయ్య, రామలక్ష్మారెడ్డి, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి తోడ్పాటు : కార్పొరేటర్

మియాపూర్, జనవరి 4 : మియాపూర్ డివిజన్ రాఘవేంద్ర పాంచజన్య అపార్ట్‌మెంట్ నూతన కమిటీ ప్రతినిధులు శనివారం కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. కాలనీ సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధికి తోడ్పాటును అందిస్తానని కార్పొరేటర్ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రతినిధులు సూర్యప్రకాశ్, విజయసారథి, రవి, శరత్‌బాబు, ప్రకాశ్, రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

జీడిమెట్ల ఇండస్ట్రీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

జీడిమెట్ల, జనవరి 4 : జీడిమెట్ల ఇండస్ట్రీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఇండస్ట్రియల్ భవన్‌లో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సాయికిశోర్, ఉపాధ్యక్షుడిగా రంగరాజు, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులురెడ్డి, జాయింట్ సెక్రటరీగా సత్యనారాయణ, కోశాధికారిగా నీలం, డీ.కరుణ్, సభ్యులుగా కే.శ్రీనివాస్‌రెడ్డి, కిశోర్ పటేల్, సౌమ్య, శ్రీనివాసరాజు, జీకే చౌదరి, భాస్కరరావు, శ్రీనివాస్ రాజు, అభినవ్‌కుమార్‌రెడ్డి, కోటేశ్వర్ రావు ఎన్నికయ్యారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

బాలానగర్, జనవరి 4 : ఎంఎన్‌వై యువసేన, మహాలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ సంయుక్తంగా రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఓల్డ్‌బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఎన్‌వై యువసేన కమిటీ సభ్యులు మల్లేశ్, మహేశ్, సాయిబాబా, మల్లికార్జున్, శేఖర్, వెంకట్, ఉదయ్, శ్రీకాంత్, పోచయ్య, రాజు, శ్రీను, యాదగిరి, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

జనాభాకు అనుగుణంగా డ్రైనేజీల ఆధునీకరణ

మణికొండ, జనవరి 4: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను అధునాతన పద్ధతిలో ఆధునీకరిస్తున్నామని నార్సింగి మున్సిపాలిటీ చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్ పేర్కొన్నారు. మంచిరేవులలో శివపురి కాలనీలో డ్రైనేజీ పైపులైన్ పనులను రూ.15 లక్షలతో శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీవాసులు నాగార్జునరెడ్డి, రాంచందర్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు జన్మదిన వేడుకలు

దుండిగల్,జనవరి 4 : ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజు జన్మదిన వేడుకలు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో శనివారం ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పలుసేవా కార్యక్రమాలు నిర్వహించారు. కేకులు కట్‌చేయడంతో పాటు మొక్కలు నాటి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. దుండిగల్ మున్సిపాలిటీ 27వ వార్డు కౌన్సిలర్ కొర్ర శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో నర్సాపూర్‌లోని సహకార శ్రీఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తనయుడు దీపక్‌రావు చేతుల మీదుగా నిత్యాన్నదానం కోసం బియ్యం, పప్పు ఇతర సరుకులను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. సీనియర్ నాయకులు రవీందర్‌నాయక్, అనిల్‌కుమార్, అభిమానులు పాల్గొన్నారు.

దుండిగల్ : డిజైర్‌సొసైటీలో చిన్నారులకు అల్పాహారం పంపిణీ చేస్తున్న నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజుయాదవ్, రమేశ్ తదితరులు

నర్సాపూర్ సహకార శ్రీఆంజనేయస్వామి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న కౌన్సిలర్ శంకర్‌నాయక్ తదితరులు

నిజాంపేట్ కార్పొరేషన్‌లో..

నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని అంబీర్‌చెరువు వద్ద ఎమ్మెల్సీ జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రజాప్రతినిధులు 150 మొక్కలు నాటారు. అంతకుముందు బీఆర్‌ఎస్ నేత ఎం.రమేశ్ ఆధ్వర్యంలో డిజైర్ సొసైటీ పిల్లలకు అల్పాహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజుయాదవ్,కార్పొరేటర్లు ప్రణయ,సుజాత, రవికిరణ్,బాలాజీనాయక్, కోఅప్షన్ సభ్యులు జ్యోతిసతీశ్, గ్రేటర్ హైదరాబాద్ వడ్డేర సంఘం అధ్యక్షుడు దండుగుల స్వామి, బీఆర్‌ఎస్ నాయకులు చంద్రయ్య, సాంబశివారెడ్డి,భిక్షపతి,ముత్యాలు,స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

జగద్గిరిగుట్టలో..

జగద్గిరిగుట్ట : ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు పుట్టిన రోజును శనివారం జగద్గిరిగుట్టలో ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ. మాజీ కార్పొరేటర్ సురేశ్‌రెడ్డి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కొలుకుల జైహింద్, మహమ్మద్‌రఫీ, అశోక్, వేణుయాదవ్, విఠల్, నర్సింహారెడ్డి, దాసు, బ్రహ్మాచారి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట్‌లో మొక్కలు నాటుతున్న బీఆర్‌ఎస్ నాయకుడు రంగరాయప్రసాద్, తదితరులు

జగద్గిరిగుట్టలో ఎమ్మెల్సీ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

మియాపూర్‌లో..

మియాపూర్ డివిజన్‌లో...

మియాపూర్ : ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పుట్టిన రోజు సందర్భంగా శనివారం మియాపూర్ డివిజన్‌లో బీఆర్‌ఎస్ నాయకులు వేడుకలు నిర్వహించారు. విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు కిరణ్‌యాదవ్, కలదిండి రోజా, శ్రీనివాస్‌రావు, శ్రీధర్, రాజేశ్,శ్రీశైలం,బాబు, స్వరూప, చిన్న,సంతోష్, నర్సింగ్‌రావు, శ్రీను, మధు, సతీశ్, రాజు, మల్లికార్జున్, రాజు, ముజీబ్ పాల్గొన్నారు.

దేశానికి పునరుత్పాదకశక్తి అవసరం



మాట్లాడుతున్న సుబ్బు కోటా

మాదాపూర్, జనవరి 4: సౌరశక్తి కోసం దేశంలోని 5శాతం బంజరు భూమిని ఉపయోగించడం ద్వారా గణనీయమైన శక్తిని ఉత్పత్తి చేయవచ్చని అప్టా కన్వీనర్ సుబ్బు కోటా అన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో శనివారం ‘అప్టా కాటలిస్ట్’ పేరుతో కార్యక్రమం నిర్వహించారు. అప్టా కన్వీనర్ సుబ్బు కోటా ముఖ్య అతిథిగా పాల్గొనగా నటీ నిహారిక కొణిదెల, నిర్వాహకులతో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంధన మౌలిక సదుపాయాల కారణంగా భారతదేశానికి పునరుత్పాదక శక్తి అధిక మొత్తంలో అవసరమవుతుందన్నారు. పునరుత్పాదక శక్తిలో అతిపెద్ద సవాల్ ఇన్మార్మ్ స్వభావమని చెప్పారు. దేశ జీడీపీలో 8.4 శాతానికి రియల్ ఎస్టేట్ దోహదపడుతుందన్నారు. వేగవంతమైన పట్టణీకరణ కారణంగా పునరుత్పాదక ఇంధనం, కెరీర్, పెట్టుబడి అవకాశాలు, సినిమాల్లో, వ్యాపారంలో మహిళలకు తప్పనిసరిగా నైపుణ్యాలు అవసరమన్నారు. రియల్ ఎస్టేట్, సెమీ కండక్టర్ పుష్, బిల్డింగ్ ఏ రోబస్ట్ చిప్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ ఎకో సిస్టమ్‌పై సదస్సులో చర్చించారు. గ్రీన్ కో అసోసియేట్ డైరెక్టర్ మౌర్య పైడా, బొండాడ ఇంజినీరింగ్ రాఘవేంద్ర, కేబీపీ చైర్మన్ హరి, కమల్, డ్రోన్ యూనవర్సిటీ, వినయ్ మాట్లాడారు.

లా కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 4: ఓయూ పరిధిలోని వివిధ లా కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్ ఐదో సెమిస్టర్ రెగ్యులర్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్ఎల్‌బీ తదితర కోర్సుల ఐదు, ఏడు, తొమ్మిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 17లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 21 వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

కార్పొరేటర్ దంపతులకు శుభాకాంక్షలు

అల్లాపూర్, జనవరి 4 : ఆర్కే సొసైటీ వెల్ఫేర్ అసోయేషన్ సభ్యులు శనివారం కార్పొరేటర్ సబీహాబేగం దంపతులను మర్యాదపూర్వకంగా కలిసి న్యూ ఇయర్ విషెస్ తెలియజేశారు. కార్పొరేటర్ కలిసి వారిలో షేక్ సుబాన్, నరసింహ, అన్వర్, కైసర్ తదితరులు ఉన్నారు.

సన్మానం

కొండాపూర్, జనవరి 4 : సావిత్రీబాయి పూలే జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం కొండాపూర్‌లోని సంస్కృతి గ్రూపు ఆఫ్‌స్కూల్స్ మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పాఠశాలల చైర్మన్ మంగళారపు లక్ష్మణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 4 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో శనివారం కూరగాయల ధరలు కింది విధంగా ఉన్నాయి. (కేజీ-రూపాయలలో..) టమాట 13, వంకాయ 23, బెండకాయ 40, పచ్చిమిర్చి 40, బజ్జి మిర్చి 23, కాకరకాయ 35, బీరకాయ 48, క్యాబేజి 11, ఫ్రెంచ్ బీన్స్ 40,క్యారెట్ 35, కాలీఫ్లవర్ 25, దొండ 45, చిక్కుడు 40, గోరుచిక్కుడు 28, బీట్‌రూట్ 33, క్యాప్సికం 50, ఆలుగడ్డ 25, కీర18, దోసకాయ 25, సొరకాయ 20, పొట్లకాయ (1) 18, కందగడ్డ 55, ఉల్లిపొరక 35, ఉల్లిగడ్డ 39, చింతకాయ-, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ(1) 8 నుంచి 9, చామగడ్డ 35, ముల్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 28, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు(12) 30 నుంచి 40, మునగకాయ(1) 10 నుంచి 12, పచ్చి బఠాని 50, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 200, అల్లం 100, వెల్లుల్లి 360, చింతపండు 140, కరివేపాకు 100గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.